క్లుప్తంగా

తల్లిదండ్రుల చేతుల్లోనే విద్యార్థుల భవిష్యత్



మాట్లాడుతున్న సెంచూరియన్ వర్సిటీ రిజిస్ట్రార్ పల్లవి

నెల్లిమర్ల రూరల్: మండలంలోని టెక్కలి సెంచూరియన్ వర్సిటీలో విద్యార్థుల తల్లిదండ్రుల సమావేశం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా పిల్లల అభివృద్ధిలో తల్లిదండ్రుల పాత్రపై వర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ పల్లవి కాసేపు మాట్లాడారు. విద్యార్థుల ఉన్నతి కోసం అన్ని రకాల జాగ్రత్తలు తీసుకుంటున్నామని, తల్లిదండ్రులు కూడా పిల్లల నడవడికపై ప్రత్యేక శ్రద్ధ ఉంచాలన్నారు. వారిని సన్మార్గంలో నడిపిస్తూ ఉత్తమ పౌరులుగా వెలుగొందేలా తల్లిదండ్రులు చర్యలు తీసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో డీన్ పుష్పలత తదితరులు పాల్గొన్నారు.

హిందూమతాన్ని విశ్వవ్యాప్తం చేయాలి



ఆధ్యాత్మిక ప్రసంగం ఇస్తున్న ఆధ్యాత్మిక వేత్త రాధామనోహర్‌దాస్

విజయనగరం టౌన్: హిందువులంతా చివరి వరకు హిందువుగానే జీవించాలని, పుణ్యభూమిలో హిందూమతాన్ని ఉద్ధరించాలని ఆధ్యాత్మికవేత్త రాధామనోహర్‌దాస్ కోరారు. స్థానిక మన్నార్ రాజగోపాలస్వామి ఆలయ ఆవరణలో అభయ్ హిందూ సేన, హిందూ ధర్మ రక్ష సమితిల ఆధ్వర్యంలో మహా సత్సంగం కార్యక్రమం ఆదివారం రాత్రి నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఆయనకు ఆలయ అధికారులు, అర్చకులు ఘనస్వాగతం పలికారు. అనంతరం ఆయన స్వామి వారికి ప్రత్యేక పూజలు చేసి, సభలో కాసేపు ప్రసంగించారు. హిందూమతాన్ని విశ్వవ్యాప్తం చేయాలన్నారు. ఈ విషయంలో భక్తుల అనుమతితో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో హిందూ ధర్మ రక్ష సమితి సభ్యులు పార్థసారథి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా బండెమ్మ పండగ



కోలాటం ఆడుతున్న కళాకారులు

శృంగవరపుకోట: మండలంలోని ఎస్.కోట పంచాయతీ శివారు గ్రామమైన సీతంపేటలో బండెమ్మ పండగ ఆదివారం కోలాహలంగా ముగిసింది. 14 ఏళ్ల తర్వాత పండగ నిర్వహించడంతో గ్రామంలో సందడి వాతావరణం నెలకొంది. భక్తులు అమ్మవారిని దర్శించుకుని పసుపు, కుంకుమలు, చీరలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. భక్తులకు ఇబ్బందులు కలగకుండా నిర్వాహకులు ఏర్పాట్లు చేశారు.

వైఎస్సార్‌సీపీలో నియామకాలు..

కొత్తవలస: వైఎస్సార్‌సీపీ శృంగవరపుకోట నియోజకవర్గ అనుబంధ విభాగాల అధ్యక్షులను పార్టీ అధిష్టానం నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసిందని మాజీ ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు తెలిపారు. ఈ మేరకు వారి వివరాలను ఆదివారం వెల్లడించారు. యువజన విభాగం అధ్యక్షుడిగా వాకడ సతీష్ (ఎస్.కోట మండలం).. మహిళా విభాగానికి ముమ్ములూరు వెంకటలక్ష్మి (వేపాడ మండలం).. రైతు విభాగానికి గేదెల నర్సింనాయుడు(ఎల్.కోట మండలం).. బీసీ విభాగానికి మురిపిండి గంగరాజు (వేపాడ మండలం).. ఎస్సీ విభాగానికి బోని కుమారి (కొత్తవలస మండలం).. ఎస్టీ విభాగానికి కేత వీరన్న (ఎస్.కోట మండలం).. మైనార్టీ విభాగానికి షేక్ రహమాన్ (ఎస్.కోట మండలం).. క్రిష్టియన్ మైనార్టీ అధ్యక్షుడిగా గోకేడ సత్యంనాయుడు (వేపాడ మండలం).. విద్యార్థి విభాగానికి కూనరెడ్డి వెంకటరావు (ఎస్.కోట మండలం), వలంటీర్స్ విభాగానికి జేడీకే అప్పలరాజు (ఎల్.కోట మండలం).. గ్రీవెన్స్ విభాగానికి కండిపల్లి పెదనాయుడు (వేపాడ మండలం).. వాణిజ్య విభాగానికి కొట్యాడ శ్రీనివాసరావు (ఎల్.కోట మండలం), చేనేత విభాగానికి స్వర్ణపూడి వెంకటరమణ (వేపాడ మండలం), కార్మిక విభాగానికి కోన దేముడు (కొత్తవలస మండలం), టీచర్స్ విభాగానికి జి.కృష్ణారావు (జామి మండలం), అంగన్‌వాడీ విభాగ అధ్యక్షురాలిగా బొడ్డి చాముండేశ్వరి (కొత్తవలస మండలం), లీగల్ విభాగానికి కళ్లంపూడి మహేష్ (కొత్తవలస మండలం), సాంస్కృతిక విభాగానికి బీల సతీష్ (వేపాడ మండలం), సోషల్ మీడియా విభాగానికి యడ్ల కిషోర్‌కుమార్(లక్కవరపుకోట మండలం), ఐటీ విభాగానికి జి.శ్రీనివాసరావు(కొత్తవలస మండలం), దివ్యాంగుల విభాగానికి డి.అప్పలరాం (జామి మండలం), డాక్టర్ల విభాగానికి పి.శ్రీనివాసరావు (ఎస్.కోట), ఇంటలెక్చువల్ విభాగానికి తూర్పాటి శివాజి (ఎల్.కోట), ఎంప్లాయీస్ అండ్ పెన్షనర్స్ విభాగం అధ్యక్షుడిగా ఎం.కృష్ణంనాయుడు(ఎస్.కోట), బూత్ కమిటీ విభాగానికి గేదెల వెంకటరావు (జామి మండలం), ప్రచార విభాగ అధ్యక్షుడిగా బోదల సురేష్(కొత్తవలస మండలం) నియమితులయ్యారు.

రేషన్ కష్టాలు!

- పాత విధానంలోనే మళ్లీ రేషన్ పంపిణీ
- చౌకధరల దుకాణాలకు జనం పరుగులు
- గంటల తరబడి క్యూలైన్‌లో పడిగాపులు
- ప్రభుత్వంపై లబ్ధిదారుల మండిపాటు



పూసపాటిరేగ: రెల్లివలసలో సర్వర్ మొరాయించడంతో రేషన్ షాపు వద్ద లబ్ధిదారుల నిరీక్షణ

పూసపాటిరేగ: రేషన్ కార్డుదారులకు మళ్లీ కష్టాలు ప్రారంభమయ్యాయి. గతంలోని వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అమలు చేసిన ఇంటి వద్దకే రేషన్ విధానం రద్దు చేసి పాత విధానంలో రేషన్ సరుకుల పంపిణీకి కూటమి ప్రభుత్వం ఆదివారం శ్రీకారం చుట్టింది. దీంతో ఇన్నాళ్లు ఇంటి దగ్గర దర్జాగా కూర్చొని రేషన్ తీసుకున్న జనం చౌకధరల దుకాణాలకు పరుగులు తీయాల్సిన దుస్థితి ఏర్పడింది. తీరా అక్కడికి వెళ్లాక భారీ క్యూలైన్ ఉండడం, సర్వర్ సమస్యలు వంటి వాటితో గంటల తరబడి వేచి చూడాల్సిన పరిస్థితి. ఈ నేపథ్యంలో చంద్రబాబు సర్కారు తీరుపై లబ్ధిదారుల నుంచి పెద్దఎత్తున విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఎండీయూ వాహనాల ద్వారా ఇంటి వద్దకే రేషన్ పంపిణీ చేస్తే నష్టమేమిటి.. కొత్త విధానం తీసుకురావడం వల్ల ప్రజలను ఇబ్బంది పెట్టడం తప్ప ఇంకేమైనా ఉందా అని ప్రశ్నిస్తున్నారు. గతంలోని వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అమలు చేసిన రేషన్ పంపిణీ విధానమే బాగుందని అభిప్రాయపడుతున్నారు.

మండలం	రేషన్ వాహనాలు	రేషన్ షాపులు	రేషన్ కార్డుదారులు
పూసపాటిరేగ	16	47	24,009
నెల్లిమర్ల	20	42	24,213
డెంకాడ	10	42	17,865
భోగాపురం	11	32	18,344

నియోజకవర్గంలో 163 రేషన్ షాపులు..

నెల్లిమర్ల నియోజకవర్గ వ్యాప్తంగా మొత్తం 163 రేషన్ షాపులు ఉండగా వాటి పరిధిలో 57 ఎండీయూ వాహనాల ద్వారా 84,431 మంది రేషన్‌కార్డుదారులకు గతంలో రేషన్ అందజేసేవారు. ఇప్పుడు పరిస్థితి తారుమారు అయింది. రేషన్ పంపిణీ వాహనాలను ఎత్తివేసి డీలర్ షాపుల(చౌకధరల దుకాణం/రేషన్ షాపు)వద్ద నిత్యావసర సరుకుల పంపిణీని ప్రారంభించింది. రేషన్ పంపిణీ వాహనాలకు సంబంధించి, ఒప్పందం అమలు 2027 వరకు ఉండగా, ప్రస్తుత కూటమి ప్రభుత్వం దానిని రద్దు చేయడంతో అటు ఎండీయూ వాహనదారులు ఉపాధి కోల్పోయి వీధిన పడగా, ఇటు రేషన్‌కార్డుదారులు కూడా రేషన్ తీసుకునేందుకు అష్టకష్టాలు పడుతున్నారు. మళ్లీ పాత విధానమే అమలు చేయాలని కోరుతున్నారు.

ఇంటి వద్దకే రేషన్ ఇవ్వాలి..



పాత రేషన్ విధానం అమలు చేసి, ఇంటి వద్దకే వాహనాల ద్వారా రేషన్ అందివ్వాలి. జూన్ 1వ తేదీ నుంచి పాత పద్ధతిలో ప్రారంభమైన రేషన్ విధానం వల్ల చౌకధరల దుకాణం వద్ద పడిగాపులు కాయాల్సి వస్తోంది. గతంలోని ప్రభుత్వం అనుసరించిన ఎండీయూ వాహనాలను మళ్లీ వాడుకలోకి తీసుకురావాలి.

–దొంతల రాజు, రెల్లివలస

వాహనాల రద్దు సరికాదు..

గతంలోని వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అమలు చేసిన రేషన్ వాహనాలు రద్దు చేయడం సరికాదు. ఎండీయూ వాహనాలు ఉండడం వల్ల ప్రభుత్వానికి ఇబ్బంది ఏంటో తెలియడం లేదు. దర్జాగా ఇంటి దగ్గర తీసుకోవాల్సిన బియ్యం.. ఇప్పుడు డిపోల వద్దకు వెళ్లాల్సిన వస్తోంది. పనులు మానుకుని మరీ వెళ్తున్నాం. సమయం వృథా అవుతోంది.

–నడిపేన స్వాతి, రేషన్ లబ్ధిదారు, రెల్లివలస

ప్రజలను ఇబ్బంది పెట్టడానికే..



ప్రజలను ఇబ్బంది పెట్టడమే పనిగా ప్రభుత్వం పెట్టుకున్నట్లుంది. దర్జాగా ఇంటి దగ్గర అందాల్సిన రేషన్‌ను దూరం చేశారు. మళ్లీ రేషన్ డిపోల వద్దకే రమ్మంటున్నారు. గంటల తరబడి ఎండలో నిలబడాల్సి వస్తోంది. రేషన్ వాహనాలు ఉన్నప్పుడే బాగుండేది.

– టొంపల ఎల్లమ్మ, రేషన్ కార్డుదారు, పూసపాటిరేగ

నియోజకవర్గంలో మొత్తం రేషన్ షాపులు:	మండల పరిధిలోని షాపులు:	కార్పొరేషన్ పరిధిలోని షాపులు:	మండల పరిధిలోని రేషన్ కార్డులు:	కార్పొరేషన్ పరిధిలో రేషన్ కార్డులు:
112	36	86	21,372	53,500



ధర్మపురిలో రేషన్ కోసం క్యూలైన్‌లో రేషన్ కార్డుదారులు



విజయనగరం: ఈ చిత్రంలో కనిపిస్తున్న వ్యక్తి పేరు అప్పయ్యమ్మ. విజయనగరం కార్పొరేషన్ పరిధిలోని కొత్తధర్మపురి ప్రాంతానికి చెందిన ఈమె..గతంలోని వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అమలు చేసిన ఇంటి వద్దకే రేషన్ విధానం ద్వారా ఎండీయూ వాహనంతో ఇంటి వద్దనే దర్జాగా రేషన్ అందుకునేది. ఇప్పుడు అధికారంలోని కూటమి ప్రభుత్వం గత ప్రభుత్వం అమలు చేసిన విధానం పక్కనబెట్టి మళ్లీ పాత విధానాన్నే తీసుకురావడంతో ఇలా వృద్ధాప్యంలో ఆమె మళ్లీ కష్టాలు పడాల్సి వచ్చింది. నెత్తిన బియ్యం మూట, చేతిలో పప్పు ప్యాకెట్లతో అతికష్టం మీద ఇంటిబాట పట్టాల్సిన పరిస్థితి ఏర్పడింది. దీంతో కూటమి ప్రజావ్యతిరేక విధానాలపై ప్రజలంతా దుమ్మెత్తిపోస్తున్నారు. పాత విధానం కొనసాగిస్తే తప్పేంటని ప్రశ్నిస్తున్నారు. ప్రజలను ఇబ్బందులు పెట్టే పనులు మానుకోవాలని కోరుతున్నారు.

అప్పట్లో పడే కష్టాలు చూడలేకే..



కొత్తధర్మపురిలో రేషన్ సరుకుల కోసం లబ్ధిదారుల అవస్థలు

అప్పట్లో రేషన్ దుకాణాల వద్ద వృద్ధులు పడే కష్టాలు చూసి ఓర్వలేకనే గతంలోని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఇంటి వద్దకే రేషన్ విధానం తీసుకువచ్చారు. ఎండీయూ వాహనాల ద్వారా ఇంటింటికీ వెళ్లి రేషన్ సరుకులు పంపిణీ చేయించారు. ఇప్పుడు అదే విధానాన్ని కొత్తగా అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం రద్దు చేసింది. జూన్ 1వ తేదీ నుంచి మళ్లీ పాత విధానంలోనే రేషన్ పంపిణీ ఉంటుందని ప్రకటన చేసింది. ఈ మేరకు ఆదివారం రేషన్ పంపిణీ చేపట్టింది. చాలామంది పనులు మానుకుని, గంటల తరబడి క్యూలైన్‌లో రేషన్ బియ్యం కోసం డీలర్ షాపుల వద్ద వేచి చూడాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఈ క్రమంలో అప్పట్లో ఉండే విధానమే బాగుండేదని ఇప్పుడేంటి ఈ అవస్థలు అని అంతా అనుకుంటున్నారు. ఇంటి వద్దకే రేషన్ విధానం అమలు చేయాలని ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేస్తున్నారు.

యోగాతో మానసిక, శారీరక ఆరోగ్యం



యోగా సాధన చేస్తున్న పట్టణవాసులు

- నగరపాలక సంస్థ కమిషనర్ పల్లి నల్లనయ్య

విజయనగరం: యోగా చేయడం ద్వారా శారీరక ఆరోగ్యంతో పాటు మానసిక ఆరోగ్యం కలుగుతుందని నగరపాలక సంస్థ కమిషనర్ పల్లి నల్లనయ్య అన్నారు. యోగాంధ్ర 2025 కార్యక్రమంలో భాగంగా స్థానిక మెకానిక్ టెంపుల్ వద్ద యోగాసనాలు వేసే కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. ఆంధ్రా వర్సిటీ ప్రొఫెసర్ ఇందుమతి ఈ కార్యక్రమంలో పాల్గొని, అందరితో యోగాసనాలు వేయించి, వాటి ప్రయోజనాలు వివరించారు. అనంతరం యోగా విశిష్టతను తెలియజేస్తూ ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ప్రతిఒక్కరూ యోగా పట్ల చైతన్యవంతులు కావాలని, యోగాసనాలు సాధన చేయాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ అధికారి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

బాధ్యతల స్వీకరణ

పూసపాటిరేగ: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలిగా కాకినాడ సౌభాగ్యలక్ష్మి ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ హెచ్‌ఎంగా పనిచేసిన బలివాడ శంకరరావు.. రెల్లివలస జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు బదిలీ అయ్యారు. విద్యార్థుల శత శాతం ఉత్తీర్ణతకు, విద్యాభివృద్ధికి కృషి చేస్తానని ఆమె తెలిపారు.

మంచి లక్షణాలు అలవర్చుకోవాలి



విద్యార్థినికి బహుమతి అందజేస్తున్న జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి లక్ష్మి

విజయనగరం టౌన్: విద్యార్థి దశ నుంచే మంచి లక్షణాలు అలవర్చుకోవాలని జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి బి.లక్ష్మి సూచించారు. స్థానిక గ్రంథాలయంలో వేసవి శిక్షణ శిబిరంలో భాగంగా విద్యార్థులకు క్యారమ్ పోటీలు ఆదివారం నిర్వహించారు. అనంతరం విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమానికి హాజరైన ఆమె మాట్లాడుతూ విజ్ఞానం, వినోదం అందించే వేసవి శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని విద్యార్థులను కోరారు. ప్రతిరోజూ క్రమం తప్పకుండా గ్రంథాలయానికి హాజరైతే జ్ఞానం రెట్టింపు అవుతుందన్నారు. అంతకుముందు మాజీ ముఖ్యమంత్రి నీలం సంజీవరెడ్డి జయంతి నిర్వహించి, ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి, నివాళులర్పించారు. కార్యక్రమంలో గ్రంథాలయాధికారి కె.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

వరహాలరావు సేవలు ఆదర్శనీయం



వరహాలరావు దంపతులను సన్మానిస్తున్న సీపీవో బాలాజీ, సిబ్బంది

విజయనగరం అర్బన్: జిల్లా ముఖ్య ప్రణాళికా విభాగం గణాంకాధికారి(ఎస్‌వో) ఎంవీ వరహాలరావు సేవలు భావితరాలకు ఆదర్శనీయమని చీఫ్ ప్లానింగ్ అధికారి పి.బాలాజి ప్రశంసించారు. వరహాలరావు ఉద్యోగ విరమణ పురస్కరించుకుని, స్థానిక కలెక్టరేట్‌లో ఆయనను ఆదివారం ఘనంగా సన్మానించారు. అనంతరం పలువురు వరహాలరావు గారితో తమకు అనుబంధాన్ని గుర్తు చేసుకుని, విధి నిర్వహణలో ఆయన కనబరిచిన చిత్తశుద్ధి, నిబద్ధతను తెలిపారు. 36 ఏళ్ల పాటు ఆయన పనిచేశారని, ఏనాడూ ఏ ఒక్కరితోనూ వివాదాలకు పోలేదని, మంచి వ్యక్తిత్వం ఉన్న వ్యక్తిగా, గొప్ప ఉద్యోగిగా పేరు ప్రఖ్యాతలు సంపాదించారన్నారు. ఎవరైనా మనముందున్న మంచి వ్యక్తులను ఆదర్శంగా తీసుకుని, జీవితం సాగించాలని కోరారు. కార్యక్రమంలో సెట్విజ్ జిల్లా అధికారి అల్లు సోమేశ్వరరావు, వ్యవసాయ శాఖ జేడీ తారకరామారావు తదితరులు పాల్గొన్నారు.

సినీ రంగంలో రాణిస్తున్న దాసరిపేట కుర్రోడు



అన్నపూర్ణ స్టూడియోలో నటి అన్నపూర్ణకు సీన్ వివరిస్తున్న సిద్ధూ తాడేల

దత్తిరాజేరు: మండలంలోని దాసరిపేటకు చెందిన యువకుడు సిద్ధూ తాడేల సినీ రంగంలో రాణిస్తున్నాడు. సిద్ధూకు చిన్నప్పటి నుంచే సినిమాలంటే విపరీతమైన మోజు. దీంతో తాను ఇంటర్ వైజాగ్‌లో చదువుతానని చెప్పి గ్రామంలో కూలి పనులు చేసుకుంటున్న తల్లిదండ్రులను ఒప్పించి వైజాగ్‌కు మకాం మార్చాడు. అక్కడ బీవీకే కళాశాలలో ఇంటర్‌లో చేరినా సినిమాలపై ఉన్న ఆసక్తితో వైజాగ్‌లో ఎక్కడ సినిమా షూటింగ్‌లు జరిగినా అక్కడ వాలిపోయి అన్నీ గమనించేవాడు. వైజాగ్‌కు చెందిన ప్రొడక్షన్ మేనేజర్ గెద్దం శ్రీను పిలుపుతో సిద్ధూ సినిమా రంగం వైపు అడుగులేశాడు. ప్రస్తుతం 24 సంవత్సరాల వయసున్న సిద్ధూ సింగం-3, జయమ్ము నిశ్చయమ్మురా, ఉన్నది ఒక్కటే జిందగీ, నిన్ను కోరి, జక్కన్న, తదితర సినిమాలకు అసిస్టెంట్ డైరెక్టర్‌గా పని చేశాడు. బాహుబలి ప్రభాకర్ ప్రధాన పాత్రలో ఓ సినిమా పూర్తి చేశానని.. అది ప్రస్తుతం పోస్టు ప్రొడక్షన్‌లో ఉందని... అలాగే హాస్యబ్రహ్మ బ్రహ్మానందం ప్రధాన పాత్రలో మరో సినిమాకు దర్శకత్వం వహించే అవకాశం లభించినట్లు సిద్ధూ తెలిపారు. సినిమా రంగంలో అంచెలంచెలుగా ఎదుగుతున్న సిద్ధూను గ్రామస్తులు అభినందిస్తున్నారు.

కూటమి నేతల ప్రచారం పిచ్చి పీక్స్‌కు..




కూటమి నేతల ప్రచారం పిచ్చి పీక్స్‌కు చేరుకుంది. ఆదివారం జరిగిన రేషన్ పంపిణీకి అదేదో ప్రభుత్వం ప్రారంభించిన కొత్త కార్యక్రమం లాగా జనసేన, టీడీపీ నేతలు పార్టీ కండువాలతో మెరిశారు. పలువురు లబ్ధిదారులకు రేషన్ అందిస్తూ ఫొటోలకు ఫోజులిచ్చారు. ఇది చూసిన జనమంతా ముక్కున వేలేసుకున్నారు. వారి ప్రచార పిచ్చిపై దుమ్మెత్తిపోస్తున్నారు. ఇప్పటికే ఇంటి వద్దకు వచ్చే రేషన్‌ను దూరం చేసి, ఇలా ఎక్కడికో వెళ్లి రేషన్ తీసుకునేలా చేశారని, ఇదేదో ప్రజలకు మేలు చేసే పథకంలా బిల్డప్ ఇస్తున్నారని అంతా విమర్శిస్తున్నారు. ఈ చిత్రంలో నెల్లిమర్ల మండలం, గరికిపేటలో జరిగిన రేషన్ పంపిణీకి పార్టీ కండువాలతో హాజరైన కూటమి నాయకులను చిత్రంలో చూడొచ్చు.


-నెల్లిమర్ల రూరల్

గ్రంథాలయాలపై 'కూటమి' నిర్లక్ష్యం..

- మరుగుదొడ్లు లేక ఇబ్బందులు
- రక్షణగోడ నిర్మాణం ఇంకెన్నడో..



గజపతినగరం గ్రంథాలయం భవనం



పాఠకులతో కిటకిటలాడుతున్న గ్రంథాలయం

గజపతినగరం రూరల్: ప్రజలకు విజ్ఞానాన్ని అందించే గ్రంథాలయాల్లో కనీస వసతులు లేక పాఠకులు నానా ఇబ్బందులు పడుతున్నారు. మండల కేంద్రంలో ఉన్న గ్రంథాలయానికి నిత్యం వంద నుంచి రెండొందల మంది వరకు పాఠకులు వస్తుంటారు. ఈ గ్రంథాలయంలో దినపత్రికలతో పాటు పోటీ పరీక్షలకు సంబంధించిన పుస్తకాలు అందుబాటులో ఉంటాయి. దీంతో పాఠకులు అధిక సంఖ్యలో ప్రతిరోజూ గ్రంథాలయానికి వస్తుంటారు. అయితే కుర్చీలు సరిపడా లేకపోవడంతో పాఠకులు ఆరుబయట నిల్చొని చదువుకోవాల్సి వస్తోంది. అలాగే గ్రంథాలయంలో గదుల కొరతతో పాటు మరుగుదొడ్లు లేక పాఠకులు చాలా ఇబ్బంది పడుతున్నారు. పాఠకుల్లో అధికశాతం మంది మహిళలు, వృద్ధులు కావడంతో వారి బాధ వర్ణణాతీతం. అలాగే గ్రంథాలయ భవనానికి రక్షణగోడ లేకపోవడంతో ఆవరణలోనికి పశువులు, కుక్కలు, పందులు వచ్చి నిత్యం అపరిశుభ్ర వాతావరణం సృష్టిస్తున్నాయని పాఠకులు చెబుతన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చాక గ్రంథాలయాల నిర్వహణ అధ్వానంగా మారిందనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు, పాలకులు స్పందించి సమస్యలు పరిష్కరించాలని పలువురు కోరుతున్నారు.

మరుగుదొడ్లు ఏర్పాటు చేయాలి..

గ్రంథాలయానికి నిత్యం సుమారు రెండొందల మంది వరకు పాఠకులు వస్తుంటారు. అందులో అధిక శాతం మహిళలు, వృద్ధులు ఉంటున్నారు. గ్రంథాలయం ఆవరణలో మరుగుదొడ్లు లేక నానా ఇబ్బంది పడుతున్నాం. వెంటనే మరుగుదొడ్లు నిర్మించాలి.

-తాడ్డి.లావణ్య, పాఠకురాలు, గజపతినగరం

ప్రహరీ లేక ఇబ్బందులు

గ్రంథాలయానికి ప్రహరీ లేకపోవడంతో పశువులు, పందులు ఆవరణను పాడు చేస్తున్నాయి. ఆవరణలో ఉన్న పూల మొక్కలు పాడవుతున్నాయి. అధికారులు స్పందించి ప్రహరీ నిర్మించాలి.

- అల్తి జగదీష్, దిగువవీధి, గజపతినగరం

ఉన్నతాధికారులకు నివేదించాం..

గ్రంథాలయంలో లోపల ఒక్క మరుగుదొడ్డి ఉన్నా నీరు లేక వినియోగంలో లేదు. అలాగే రక్షణ గోడ నిర్మాణం చేపట్టాలని, మరుగుదొడ్లు నిర్మించాలని ఉన్నతాధికారులకు తెలియజేశాం.

-స్వాతి, లైబ్రేరియన్ గజపతినగరం

బీజేపీ నేత గొల్లపూడి మృతి

గుర్ల: బీజేపీ మాజీ మండల అధ్యక్షుడు గొల్లపూడి సత్యనారాయణమూర్తి (65) శనివారం రాత్రి మృతి చెందారు. ఈయన కొద్ది రోజులుగా అనారోగ్యంతో బాధపడుతూ కన్నుమూశారు. మృతదేహాన్ని మాజీ ఎమ్మెల్సీ పీవీఎస్ మాధవ్, బీజేపీ జిల్లా అధ్యక్షుడు రాజేష్ వర్మ ఆదివారం సందర్శించి నివాళులర్పించారు. అవయవదానంలో భాగంగా నెల్లిమర్ల మిమ్స్‌కు మృతదేహాన్ని కుటుంబ సభ్యులు అందజేశారు.